సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

ఆదివారం । 5 । జనవరి । 2025



చీనీ టన్ను రూ.30 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో శనివారం టన్ను చీనీ గరిష్టంగా రూ.30 వేలు, కనిష్టంగా రూ.10 వేలు, సరాసరిన రూ.16,500 ప్రకారం ధర పలికాయి.



కిలో టమాట రూ.9

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్టంగా రూ.9, కనిష్టంగా రూ.5, సరాసరిన రూ.7 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం
31.3°/07.7°

జిల్లా వ్యాప్తంగా కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. శనివారం చలి తీవ్రత బాగా పెరిగింది. గంటకు 6 నుంచి 8 కి.మీ వేగంతో ఈశాన్యం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

బాలయ్య పీఏ మోసగాడు

- అతనితో ఎవరూ ఆర్థిక లావాదేవీలు జరపకండి
- ఉద్యోగం కోసం తీసుకున్న డబ్బుల్లో రూ.50 వేలు తిరిగి ఇవ్వలేదు
- సామాజిక మాధ్యమాల్లో బాధితుడి ఆవేదన



వాట్సాప్‌లో వైరల్ అవుతున్న లేఖ

హిందూపురం: ఎమ్మెల్యే బాలకృష్ణ పీఏ చంద్రమోహన్‌పై అతనికి కొడుకు వరుసయ్యే యువకుడు సామాజిక మాధ్యమాల్లో పెట్టిన పోస్టులు శనివారం స్థానికంగా వైరల్‌గా మారాయి.

యువకుడు సామాజిక మాధ్యమాల్లో పెట్టిన పోస్టు ఇలా..

''నా పేరు మిథిలేష్ యాదవ్, నేను మోతుకపల్లిలో నివాసం ఉంటున్నా. 220 కేవీ సబ్ స్టేషన్‌లో ఒక ఉద్యోగం కోసం ఎమ్మెల్యే బాలయ్య పీఏ చంద్రమోహన్ (టీడీపీ పార్లమెంటరీ మీడియా కోఆర్డినేటర్)ను సంప్రదించాను. ఆయన నాకు వరుసకు చిన్నాన్న అవుతారు. అయినా ఉద్యోగం ఇప్పిస్తానని రూ.1.50 లక్షల డిమాండ్ చేశాడు. డబ్బులిచ్చాక ఎమ్మెల్యే బాలకృష్ణ సిఫారసు లేఖ ఇచ్చారు. అయితే ఆ లేఖను తీసుకువెళ్లి అధికారులకు ఇవ్వగా...సబ్‌స్టేషన్ పెనుకొండ నియోజకవర్గంలో ఉందని, అందువల్ల ఆ లేఖను పరిగణనలోకి తీసుకోలేమన్నారు. ఇదే విషయాన్ని బాలకృష్ణ పీఏ చంద్రమోహన్‌కు తెలిపి..నా డబ్బులు వెనక్కు ఇవ్వాలని కోరాను. తొలుత అందుకు అతను నిరాకరించాడు. ఆ తర్వాత కుటుంబ పెద్దలతో సంప్రదించగా రూ.లక్ష ఇచ్చాడు. మిగతా రూ.50 వేలు ఇవ్వాలని కోరగా...రూ.లక్ష ఇచ్చినపుడు తీసుకున్న ఫొటోను చూసి అప్పుడే మొత్తం ఇచ్చేశానని అబద్ధం ఆడుతున్నాడు. నన్ను బ్లాక్‌మెయిల్ చేస్తున్నాడు. బంధువైన నన్నే మోసం చేశాడు. అందువల్ల అతనితో ఆర్థిక లావాదేవీలు చేసి ఎవరూ మోసపోకండి''

ధర్మవరం వాసి తమిళనాడులో మృతి

- అయ్యప్ప దర్శనానికి వెళ్లి తిరిగి వస్తుండగా గుండెపోటు
- మృతుడు చార్టెడ్ అకౌంటెంట్



వీరాంజనేయులు(ఫైల్)

ధర్మవరం అర్బన్: పట్టణానికి చెందిన చార్టెడ్ అకౌంటెంట్ గట్టు వీరాంజనేయులు(44) అయ్యప్ప స్వామి దర్శనానికి వెళ్లి తిరిగి వస్తూ గుండెపోటుతో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, స్నేహితులు తెలిపిన వివరాల మేరకు... పట్టణంలోని సుందరయ్యనగర్‌కు చెందిన గట్టు వీరాంజనేయులు చార్టెడ్ అకౌంటెంట్‌గా పనిచేస్తున్నాడు. మూడు రోజుల క్రితం స్నేహితులతో కలిసి శబరిమల వెళ్లాడు. అయ్యప్పస్వామి దర్శనం అనంతరం శుక్రవారం తిరిగి ధర్మవరానికి కారులో బయలుదేరాడు. తమిళనాడు రాష్ట్రం దిండిగల్ సమీపంలోకి రాగానే ఆయనకు ఛాతిలో నొప్పి రావడంతో స్నేహితులు సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. శనివారం ఉదయం వీరాంజనేయులు మృతదేహాన్ని ధర్మవరానికి తీసుకువచ్చారు. మృతునికి భార్య లీలతో పాటు కుమారులు హర్షవర్ధన్, కార్తీక్ ఉన్నారు. కుటుంబ పెద్ద మృతి చెందడంతో భార్య, పిల్లలు బోరున విలపించారు.

కొండవీడు బండి.. ఎక్కలేమండీ!



ధర్మవరం రైల్వేస్టేషన్‌లో నిలిచిన కొండవీడు ఎక్స్‌ప్రెస్ రైలు

- ధర్మవరంలో రెండు గంటల పాటు హాల్ట్
- సమయం మార్చడంతో ప్రయాణికుల ఇక్కట్లు
- పుట్టపర్తి నుంచి మధ్యాహ్నం 3.30 గంటలకే డిపార్ట్
- సాయంత్రం 6.15 వరకు ధర్మవరం స్టేషన్‌లోనే..

సాక్షి, పుట్టపర్తి

పుట్టపర్తి జిల్లా కేంద్రం అయ్యాక రాకపోకలు పెరిగాయి. ముఖ్యంగా అప్పటి వరకూ అనంతపురంలో ఉన్న ఉద్యోగులు తప్పనిసరి పరిస్థితుల్లో పుట్టపర్తికి మకాం మార్చారు. అయితే చాలా మంది పెద్దల ఆరోగ్య సమస్యలు, పిల్లల చదువుల దృష్ట్యా రోజూ అనంతపురం నుంచే అప్ అండ్ డౌన్ చేస్తున్నారు. ఇలాంటి వారికి గతంలో కొండవీడు ఎక్స్‌ప్రెస్ (17212) ఎంతో ఉపయోగపడేది. అయితే ఇటీవల ఆ రైలు వేళల్లో మార్పు కారణంగా చాలా మంది ఇబ్బందులు పడుతున్నారు.

ధర్మవరం నుంచి సమయం మార్పు..

వారంలో మూడు (మంగళ, గురు, శనివారం) రోజుల పాటు యశ్వంతపూర్ - మచిలీపట్నం మధ్య నడిచే కొండవీడు ఎక్స్‌ప్రెస్ రైలు మారిన వేళల మేరకు రెండు గంటల ముందే నడుస్తోంది. అయితే కేవలం యశ్వంతపూర్ నుంచి ధర్మవరం వరకు మాత్రమే.. టైమింగ్ మారింది. ధర్మవరం నుంచి మచిలీపట్నం వరకు పాత షెడ్యూల్ ప్రకారమే నడుస్తోంది. ఈ రైలు గతంలో సాయంత్రం 5.20 గంటలకు పుట్టపర్తికి వచ్చేది. అయితే ప్రస్తుతం 3.30 గంటలకే వస్తోంది. దీంతో జిల్లా కేంద్రం పుట్టపర్తిలో విధులు ముగించుకుని అనంతపురం వెళ్లే ఉద్యోగులకు, ఇతర వర్గాల వారికి కొండవీడు ఎక్స్‌ప్రెస్ అందుబాటులో లేకుండా పోయింది. దీంతో పుట్టపర్తి నుంచి అనంతపురం వెళ్లాల్సిన ఉద్యోగులు సాయంత్రం 6.40 గంటలకు వచ్చే కాచిగూడ రైలు వరకు వేచి ఉండాల్సిన పరిస్థితి.

టీచర్లకు తప్పని తిప్పలు..

పుట్టపర్తి చుట్టుపక్కల పనిచేసే ప్రభుత్వ ఉపాధ్యాయుల్లో చాలామంది తమ పిల్లలను గుడివాడ, విజయవాడలో చదివిస్తున్నారు. ప్రతి శనివారం సాయంత్రం విధులు ముగిశాక కొండవీడు రైలు ఎక్కి వెళ్లేవారు. అయితే ప్రస్తుతం కొండవీడు రైలు పట్టుకోవాలంటే మధ్యాహ్నం నుంచి సెలవు పెట్టాల్సిన దుస్థితి ఏర్పడింది. సెలవు పెట్టి రైలు ఎక్కినా.. రెండు గంటల పాటు ధర్మవరంలో సమయం వృథా చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విధులు ముగిశాక బయలుదేరితే నేరుగా ధర్మవరం స్టేషన్ చేరుకోవాల్సిన పరిస్థితి తలెత్తుతోందని వాపోతున్నారు.

తప్పని నిరీక్షణ..



మధ్యాహ్నం 1.15 గంటలకు యశ్వంతపూర్‌లో బయలుదేరే కొండవీడు ఎక్స్‌ప్రెస్ యలహంక, హిందూపురం, పెనుకొండ మీదుగా పుట్టపర్తి ప్రశాంతి నిలయం స్టేషన్‌కు 3.30 గంటలకు చేరుకుంటుంది. అక్కడి నుంచి ధర్మవరానికి సాయంత్రం 4 గంటలకు చేరుకుంటుంది. అక్కడ 2.15 గంటల పాటు వేచి ఉండాల్సి రావడంతో యశ్వంతపూర్, హిందూపురం, పుట్టపర్తిలో ఎక్కిన ప్రయాణికులంతా ఇబ్బందులు పడుతున్నారు.

ఎందుకు మార్చారో?



కొండవీడు ఎక్స్‌ప్రెస్ ఇంతకుముందు సరైన సమయానికే నడిచేది. ఉన్నఫళంగా టైమింగ్ మార్చారు. దీంతో హిందూపురం, పెనుకొండ, పుట్టపర్తిలో ఎక్కే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసరంగా వెళ్లాల్సిన వారికి ఈ రైలు ఉపయోగపడటం లేదు. ధర్మవరంలో వెయిటింగ్ ఎందుకో ఎవరికీ అర్థం కావడం లేదు.

– పాటిల్ శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయుడు

వేళలు మార్చాలి



ప్రస్తుత కంప్యూటర్ యుగంలో ప్రతి నిమిషమూ విలువైనదే. ప్రయాణికులతో ఉన్న రైలును ఒకే స్టేషన్‌లో రెండున్నర గంటల పాటు నిలపడం సమంజసం కాదు. రైల్వే అధికారులు మరోమారు పరిశీలించి వేళల్లో మార్పులు చేస్తే ఎంతోమందికి ఉపయోగకరంగా ఉంటుంది. లేదంటే మార్చిన వేళలతో ప్రజలకు నష్టం తప్ప లాభం ఉండదు.

– లాయర్ హరికృష్ణ, పుట్టపర్తి

ఇంటర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం

- కొత్తచెరువు కళాశాలలో ప్రారంభించిన కలెక్టర్ చేతన్



భోజనం రుచి చూస్తున్న కలెక్టర్ చేతన్, డీఈఓ

పుట్టపర్తి అర్బన్: పట్టణాల్లోని కళాశాలలకు వచ్చే గ్రామీణ విద్యార్థులు చాలా మంది మధ్యాహ్నం వేళ భోజనం తినలేని పరిస్థితులు ఉన్నాయని, అందుకే ప్రభుత్వం ఏ ఒక్క విద్యార్థి పస్తు ఉండకూడదన్న లక్ష్యంతో ఇంటర్ కళాశాలల్లోనూ డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించిందని కలెక్టర్ చేతన్ అన్నారు. శనివారం ఆయన డీఈఓ కృష్ణప్పతో కలిసి కొత్తచెరువు ఇంటర్ కళాశాలలో 'డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం'ను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని 21 ఇంటర్ కళాశాలల్లో 6,220 మంది చదువుకుంటున్నారని, వారందరికీ ఇక నుంచి రోజూ మధ్యాహ్నం భోజన సదుపాయం కల్పిస్తున్నామన్నారు. ప్రభుత్వ ప్రోత్సాహాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రైవేటు కళాశాలల విద్యార్థులకు దీటుగా రాణించాలన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని నిర్వాహకులకు సూచించారు.

మత్తుకు దూరంగా ఉండాలి..

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, చెడు వ్యసనాలకు బానిస కారాదని కలెక్టర్ హితవు పలికారు. డ్రగ్స్ మీతో పాటు మీ కుటుంబాన్ని నాశనం చేస్తుందని హెచ్చరించారు. సెల్‌ఫోన్లు కూడా కేవలం విజ్ఞానానికి మాత్రం వినియోగించాలన్నారు. క్రమశిక్షణతో లక్ష్యాలను చేరుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు భోజనం వడ్డించడంతో పాటు వారితో కలసి భోజనం చేసారు. కార్యక్రమంలో ఆర్ఐఓ రఘునాథరెడ్డి, ఎంఈఓ జయచంద్ర, తహసీల్దార్ నీలకంఠారెడ్డి, ఎంపీడీఓ నటరాజ్, ప్రిన్సిపాల్ జ్యోతిర్లత, విద్యార్థులు పాల్గొన్నారు.

టీడీపీ నేతల మెడకు ఉచ్చు



చిలమత్తూరు పంచాయతీ కార్యాలయంలో విచారణ చేస్తున్న డీఎల్‌పీఓ శివనారాయణరెడ్డి

- చిలమత్తూరు పంచాయతీ నిధుల దుర్వినియోగంపై విచారణ ప్రారంభం
- ఎమ్మెల్యే కార్యాలయ నిర్మాణం కోసం నిధులు కావాలని టీడీపీ నేతలు బలవంతంగా బిల్లులు పెట్టించారు
- డీఎల్‌పీఓ ఎదుట వాపోయిన సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి

చిలమత్తూరు: స్థానిక పంచాయతీలో నిధుల గోల్‌మాల్ వ్యవహారంపై ఉన్నతాధికారులు విచారణ ప్రారంభించారు. ఎమ్మెల్యే కార్యాలయం నిర్మాణం కోసం అంటూ టీడీపీ నేతలు... సర్పంచ్‌ను బెదిరించి పంచాయతీ నిధులు స్వాహా చేసినట్లు తెలుస్తోంది. శనివారం డీఎల్‌పీఓ శివనారాయణరెడ్డి స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో విచారణ చేపట్టారు. అప్పటి పంచాయతీ కార్యదర్శి రామ్లా నాయక్, సర్పంచ్ సంధ్య, కార్యాలయ అధికారులను బిల్లులపై సమగ్రంగా విచారణ జరిపారు. సంబంధిత ఎం-బుక్కులను స్వాధీనం చేసుకుని వెంట తీసుకువెళ్లారు. బిల్లులు మంజూరుకు దారితీసిన పరిస్థితులు, ఎందుకు డ్రా చేశారన్న విషయాలను కార్యదర్శితో నోట్ రాయించుకున్నారు. టీడీపీ నేతల ఒత్తిళ్ల మేరకే బిల్లులు మంజూరు చేశామని విచారణ సందర్భంగా కార్యదర్శి చెప్పినట్లు తెలుస్తోంది. ఇందులో తనను అనవసరంగా ఇరికించారని ఆవేదన వ్యక్తం చేసినట్టు సమాచారం. విచారణలో తేలిన అంశాలపై సమగ్ర నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు అందజేస్తామని డీఎల్‌పీఓ మీడియాకు తెలిపారు.

బెదిరించి బిల్లులు చేసుకున్నారు..

''బిల్లులు పెట్టాలని టీడీపీ నేత నందీశప్ప నాపై ఒత్తిడి తెచ్చారు. ఎమ్మెల్యే కార్యాలయం కట్టాలని, అందుకోసం చెప్పిన చోటల్లా సంతకం చేయాలని బెదిరించారు. నగదు డ్రా చేసి ఇవ్వకపోతే చెక్ పవర్ తీసేస్తామని బ్లాక్ మెయిల్ చేశారు'' అని సర్పంచ్ సంధ్య విచారణ అధికారికి తెలిపారు. అంతేకాకుండా పీఎఫ్ఎంఎస్ తన మొబైల్ నంబరు తొలగించి వేరొకరి నంబరు అప్‌డేట్ చేయించారని, ఆ విషయం కూడా తనకు తెలియదని ఆమె వివరించారు. అలాగే తుమ్మలకుంటలో బోరుబావి కోసం రూ.2.50 లక్షలు వరకూ ఖర్చు చేసే అవకాశం ఉందని చెప్పి ఏకంగా రూ.6.61 లక్షలకు బిల్లు పెట్టుకున్నారని, భైరవేశ్వరుడి ఆలయం వద్ద మరుగుదొడ్లు నిర్మించినట్టుగా మరో రూ. 6 లక్షల మేర బిల్లులు చేయించుకున్నారని సర్పంచ్ సంధ్య విచారణ అధికారికి తెలిపారు. దేవుడి విషయం కావడంతో తానేమీ మాట్లాడలేక పోయానని, అయితే అక్కడ ఎలాంటి నిర్మాణం చేపట్టలేదని సర్పంచ్ విచారణ అధికారికి వెల్లడించారు.

పోలీసే మట్టి దొంగ!

- లేపాక్షి హబ్ భూముల్లో అక్రమంగా మట్టి తవ్వకం
- తాను నిర్మిస్తున్న కోళ్ల ఫాం కోసం వందల టిప్పర్లతో రవాణా
- ఈడీ అటాచ్ చేసిన భూముల్లో తవ్వకాలపై సర్వత్రా విస్మయం
- అన్నీ తెలిసీ కళ్లుమూసుకున్న రెవెన్యూ, మైనింగ్, పోలీసు శాఖలు



లేపాక్షి హబ్ భూమిలో మట్టి తవ్వకాలు జరిపిన దృశ్యం



కోళ్ల ఫాం నిర్మిస్తున్న ప్రదేశంలో డంప్ చేసిన మట్టి

చిలమత్తూరు: దొంగలను పట్టుకోవాల్సిన ఓ పోలీసు అధికారే దొంగగా మారాడు! ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు అటాచ్‌మెంట్ చేసిన భూముల్లో అక్రమంగా మట్టి తవ్వుకుని తన కోళ్ల ఫాం బేస్‌మెంట్‌కు వాడుకుంటున్నాడు. పట్టపగలే సదరు ఖాకీ వందలకొద్ది టిప్పర్ల మట్టి తరలించుకుపోతున్నా రెవెన్యూ, మైనింగ్ అధికారులు అటువైపు కన్నెత్తి చూడలేదు. ఇక తమ ఖాకీనే కదా అని పోలీసులూ అభిమానం చూపడంతో సదరు పోలీసు సారు పని పూర్తి చేశారు.

ఇక్కడ పనిచేసి... భూములు కొని..

ప్రస్తుతం రాప్తాడు నియోజకవర్గంలో ఎస్ఐగా ఉన్న సదరు అధికారి గతంలో చిలమత్తూరులో పనిచేశారు. ఆ సమయంలో ఇక్కడ దాదాపు మూడు ఎకరాల భూమి భార్య పేరు మీద కొన్నారు. ఇప్పుడు అక్కడ కోళ్ల ఫాం నిర్మిస్తున్నారు. అయితే ఈ భూమి ఏటవాలుగా ఉండటంతో లెవలింగ్ కోసం కావాల్సిన మట్టిని ఏకంగా లేపాక్షి హబ్ భూముల్లోంచి అక్రమంగా తోలుకున్నారు. నాలుగురోజులుగా ఈ తంతు సాగుతున్నా ఒక్కరూ అడ్డుచెప్పలేదు. గతంలోనే ఇలా లేపాక్షి హబ్ భూముల్లో మట్టి తరలించినందుకు ఓ రియల్టర్‌కు మైనింగ్ శాఖ రూ.2 కోట్ల మేర జరిమానా విధించింది. మరి ఎస్ఐ మట్టి దందాను ఎందుకు పట్టించుకోలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మనోడే కదా అనీ...

గత ఎన్నికల సమయంలో అనంతపురం జిల్లాలోని ఓ నియోజకవర్గం నుంచి టీడీపీ టికెట్ ఆశించిన భంగపడిన సదరు ఎస్ఐ... ఇప్పుడు రాప్తాడు నియోజకవర్గంలో పనిచేస్తున్నారు. అధికార పార్టీ నేతలతో అంటకాగుతూ అమాయకులపై ప్రతాపం చూపుతున్నారు. అందువల్లే చిలమత్తూరులో అధికార పార్టీ నేతలు కూడా ఖాకీ మట్టిదందాకు అడ్డుచెప్పలేదని తెలుస్తోంది. కానీ ఈడీ అటాచ్ చేసిన భూముల్లోని మట్టిని అక్రమంగా తరలించడంపై కోర్టు ప్రశ్నిస్తే ఎవరు సమాధానం చెబుతారో చూడాలి మరి. చట్టాన్ని ఉల్లంఘించి మట్టిదందా చేసిన ఖాకీపై పోలీసు ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటారా...మనోడే కదా అని వెనకేసుకువస్తారా చూడాలి మరి.

చిన్నారులకు టీకాలు

హిందూపురం టౌన్: జిల్లాలోని చిన్నారులందరికీ సకాలంలో టీకాలు అందేలా చూస్తానని జిల్లా నూతన ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. శుక్రవారం బాధ్యతలు తీసుకున్న ఆయన..శనివారం హిందూపురంలో విలేకరులతో మాట్లాడారు. టీకాల నిర్వహణ ఆరోగ్యకర సమాజానికి నాందిగా అభివర్ణించారు. పిల్లలకు అన్ని రకాల టీకాలను సమయానికి అందేలా చూస్తామన్నారు.

విమానాశ్రయంలో కట్టుదిట్టమైన భద్రత

- కలెక్టర్ టీఎస్ చేతన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చేతన్

పుట్టపర్తి టౌన్: సత్యసాయి విమానాశ్రయంలో కట్టుదిట్టమైన భద్రత కల్పించాలని, ఇందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ సూచించారు. శనివారం సత్యసాయి విమానాశ్రయంలో ఎయిర్‌పోర్ట్ భద్రతా కమిటీ సమావేశం నిర్వహించారు. చైర్మన్ హోదాలో సమావేశానికి హాజరైన కలెక్టర్ భద్రతపై పలు సలహాలు, సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, సత్యసాయి బాబా మహాసమాధి దర్శనార్థం వీఐపీలు, వీవీఐపీలు చాలామంది వాయుమార్గంలో పుట్టపర్తి విమానాశ్రయానికి చేరుకుంటారని, అలాంటి సమయంలో భద్రతా పరమైన సమస్యలు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఇందుకు అధికార యంత్రాంగానికి విమానాశ్రయం నిర్వాహకుల సహకారం ఉండాలన్నారు. రానున్న రోజుల్లో భద్రతా ప్రమాణాలు కూడా పెంచాలన్నారు. అనంతరం విమానాశ్రయం నిర్వాహకులు భద్రతపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, విమానాశ్రయం డైరెక్టర్ సాయినాథరెడ్డి, అడ్మిన్ లక్ష్మీనారాయణ, ఆర్డీఓ సువర్ణ, డీఎస్పీ విజయ్‌కుమార్, తహసీల్దార్ అనుపమ, మున్సిపల్ కమిషనర్ ప్రహ్లాద్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బెల్లం ఊట ధ్వంసం

ఎన్పీకుంట: మండలంలోని నల్లగుట్టపల్లి తండా శివారున శనివారం మధ్యాహ్నం 300 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు ఎస్ఐ వలీబాషా తెలిపారు. 10లీటర్ల నాటు సారాను సీజ్ చేశామన్నారు. పోలీసుల రాకను పసిగట్టిన నాటుసారా తయారీదారుడు రమేష్ నాయక్ పరారీలో ఉన్నాడని, కేసు నమోదు చేసి నిందితుడి కోసం గాలిస్తున్నామన్నారు.

'పురం'లో కర్ణాటక పోలీసుల తనిఖీలు

హిందూపురం అర్బన్: కర్ణాటక పోలీసులు శనివారం ఉదయం హిందూపురంలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. కర్ణాటక ప్రాంతంలో చోరీ కేసుల్లో పట్టుబడిన నిందితులను వెంటపెట్టుకు వచ్చిన పోలీసులు నేరుగా ప్రధాన రహదారి పక్కన ఉన్న భవన సముదాయంలోని రెండు బంగారు దుకాణాల్లో ఏక కాలంలో తనిఖీలు చేపట్టారు. ఈ దుకాణాల్లోనే తాము నగలు విక్రయించినట్లు నిందితులు తెలపడంతో గంటకు పైగా సోదాలు చేపట్టి కొంత బంగారాన్ని రికవరీ చేశారు. అయితే ఎంత రికవరీ చేసింది తెలిపేందుకు ఆ రాష్ట్ర పోలీసులు నిరాకరించారు.

పీహెచ్‌సీలో తనిఖీలు

పుట్టపర్తి టౌన్: స్థానిక ఎనుములపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్ఓ డాక్టర్ ఫిరోజ్ బేగం శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ల్యాబ్, కాన్పుల వార్డు, రికార్డులు పరిశీలించారు. చికిత్స కోసం వచ్చే రోగుల పట్ల మర్యాద పూర్వకంగా నడుచుకోవాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ జ్యోత్స్న, మునిచంద్రిక, స్టాఫ్‌నర్సులు అరుణ, నాగవేణి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల కేంద్రీయం

అనంతపురం: సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (కేంద్రీయ విశ్వవిద్యాలయం)లో అక్రమాలు కేంద్రీకృతమయ్యాయి. కార్పొరేట్ తరహాలో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి డబ్బు వసూలు చేసినా... మౌలిక సౌకర్యాల కల్పనలో విఫలమైంది. దేశ వ్యాప్తంగా 17 రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు సెంట్రల్ యూనివర్సిటీలో వివిధ కోర్సులు అభ్యసిస్తున్నారు. పబ్లిక్ వర్సిటీ అయినప్పటికీ నెలకు పెద్ద మొత్తంలో మెస్ బిల్లు చెల్లించుకోక తప్పడం లేదు. సరైన వసతి, పౌష్టికాహారం లేక వీరంతా ఆకలితో అలమటిస్తున్నారు. దీంతో విద్యార్థుల సంక్షేమాన్ని విస్మరిస్తున్నారనే విమర్శలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి. 2018లో జేఎన్‌టీయూఏలోని ఇంక్యుబేషన్ కేంద్రంగా వర్సిటీ స్థాపితమైన విషయం తెలిసిందే. ఇందులోనే అప్పట్లో తరగతులు నిర్వహించారు. అనంతరం 2022లో బళ్లారి రోడ్డులోని ఓ ప్రైవేట్ కళాశాలలో తాత్కాలిక క్యాంపస్‌ను ఏర్పాటు చేశారు. ఈ ఏడాది ఆగస్టులో జంతలూరులోని శాశ్వత భవనాల్లోకి క్యాంపస్‌ను మార్చారు. హాస్టళ్లు, అకడమిక్ భవనాలు పూర్తిగా వినియోగంలోకి వచ్చాయి. సెంట్రల్ యూనివర్సిటీలో ప్రస్తుతం వెయ్యి మంది విద్యార్థులు అభ్యసిస్తున్నారు. 400 మంది అమ్మాయిలు, 600 మంది అబ్బాయిలు హాస్టళ్లలో బస చేస్తున్నారు.

మెస్ పర్యవేక్షణ ప్రైవేట్‌కు..

మెస్ బిల్లుతో పాటు ప్రతి సెమిస్టర్‌కు హాస్టల్ మెయింటెనెన్స్ కింద రూ.3వేలు, అద్దె రూ.2 వేలు చెల్లించాలి. కొత్తగా వచ్చిన విద్యార్థులు అయితే అద్దె ఏకంగా రూ.7 వేలు చెల్లించాలనే షరతు విధించారు. సెమిస్టర్ ప్రారంభం అయ్యే తొలి రోజే మెస్ బిల్లు, మెయింటెనెన్స్, అద్దె ముందస్తుగా చెల్లించాలి. కార్పొరేట్ కళాశాల తరహాలో ముందస్తుగా చెల్లిస్తేనే తరగతులకు, హాస్టళ్లకు అనుమతిస్తారు. మెస్ నిర్వహణను పూర్తిగా ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించడం వివాదస్పదమవుతోంది. ఏకంగా నెలకు ఒక్కో విద్యార్థి రూ. 3,200 మెస్ బిల్లు చెల్లించాల్సి వస్తోంది. సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో నెలకు రూ.2,300 మాత్రమే మెస్‌బిల్లు ఉంటే ఇక్కడ మాత్రం భారీగా ఉండడం గమనార్హం. తాత్కాలిక క్యాంపస్‌లో తరగతులు నిర్వహించినప్పుడు కేవలం రూ. 2,315లు చొప్పున మెస్‌బిల్లు చెల్లించేవారు. సెంట్రల్ యూనివర్సిటీలో హాస్టల్‌లో అన్ని రకాల వంటలు వండాల్సి ఉంది. అయితే సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీలో మాత్రం పూర్తిగా ఉత్తర భారతదేశ వంటకాలు చేసి పెడుతున్నారు. ఈ వంటకాలను తినలేక సెంట్రల్ యూనివర్సిటీలో 60 నుంచి 70 శాతం మంది దక్షిణాది రాష్ట్రాలకు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. చికెన్ అనే మాట ఏ రోజూ వినపడదు. ప్రతి బుధవారం ఓ కోడిగుడ్డు ఇస్తున్నారు.



అస్మదీయులకు అప్పగింత..

వాస్తవానికి పబ్లిక్ వర్సిటీల్లో స్టూడెంట్స్ మేనేజ్‌మెంట్ విధానం కింద హాస్టళ్లను నిర్వహించాల్సి ఉంది. వంట గ్యాస్, నిత్యావసర సరుకులు అన్నింటి ఖర్చు కలిపి లెక్కించి ఒక్కో విద్యార్థికి ఎంత వస్తే అంత మొత్తాన్ని మెస్‌బిల్లుగా నిర్ధారిస్తారు. ఇందుకు విరుద్ధంగా సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీలో ఒక్కో విద్యార్థి నుంచి నెలకు రూ.3,200 వసూలు చేస్తున్నారు. దీనికి గది అద్దె, మెయింటినెన్స్ అదనంగా చెల్లిస్తున్నారు. స్టూడెంట్ మేనేజ్‌మెంట్ హాస్టళ్లలో రూ.2 వేలకు మించి రాదు. ఎస్కేయూలోని మహిళా హాస్టళ్లలో రూ.1500లకు మించి మెస్‌బిల్లు రాదు. టెండర్లు పిలిచి ఎవరు తక్కువ రేటుకు ఆహారం అందిస్తారో వారికే అప్పగించాలి. కానీ, సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీలో మాత్రం అధిక రేటుకు కోట్ చేసిన అస్మదీయులకు మెస్ బాధ్యత అప్పగించి విద్యార్థులపై అధిక భారం మోపుతున్నారు. ఎవరైనా విద్యార్థి ప్రశ్నిస్తే పరీక్షల్లో మార్కులు తగ్గించడం, ఫెయిల్ చేయడం వంటి చర్యలు తీసుకుంటుండడంతో విద్యార్థులు భయభ్రాంతులకు గురవుతున్నారు.



వర్సిటీలోని మెస్

ఆహారం బాగోలేదు

మెస్‌లో పూర్తిగా నార్త్ ఇండియన్ ఫుడ్ పెడుతున్నారు. 60 శాతం మంది ఉన్న సౌత్ ఇండియా వాళ్లకు ఈ ఆహారం రుచించడం లేదు. ఎన్నో దఫాలు వినతిపత్రాలు ఇచ్చాం. అయినా వర్సిటీ యాజమాన్యం స్పందించలేదు. గతంలో కేవలం రూ.2,300లు మాత్రమే మెస్‌బిల్లు వచ్చేది. జంతలూరులోని శాశ్వత క్యాంపస్‌లోకి మారిన తర్వాత ఏకంగా రూ. 3,200 మెస్‌బిల్లు చెల్లించాల్సి వస్తోంది. సెమిస్టర్‌కు ముందుగానే బిల్లులు చెల్లించాలి. తక్కువ కోట్ చేసినవారికి టెండర్ అప్పగించి ఉంటే మాపై ఆర్థిక భారం పడేది కాదు.

– రాజేంద్ర, పీజీ పొలిటికల్ సైన్సెస్, సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీ

చిన్నారితో పాటు తల్లి అదృశ్యం



రోజా



భవిష్య

గాండ్లపెంట: చిన్నారితో కలసి తల్లి కనిపించకుండా పోయింది. పోలీసులు తెలిపిన మేరకు... కదిరి మండలం కుమ్మరవాండ్లపల్లికి చెందిన కాయల రోజా, శ్రీనివాసులు దంపతులకు మూడేళ్ల వయసున్న కుమార్తె భవిష్య ఉంది. గాండ్లపెంట మండలం కటారుపల్లి రైతు సేవా కేంద్రంలో రోజా ఎంపీఈఓగా పనిచేస్తున్నారు. ఈ క్రమంలో ఈ నెల 3న (శుక్రవారం) కుమార్తెను వెంట బెట్టుకుని విధులకు వెళ్లిన రోజా తిరిగి ఇంటికి చేరుకోలేదు. భార్య, కుమార్తె ఆచూకీ కోసం గాలించినా ఫలితం లేకపోవడంతో శనివారం ఉదయం గాండ్లపెంట పోలీసులకు భర్త శ్రీనివాసులు ఫిర్యాదు చేశారు. ఘటనపై మిస్సింగ్ కేసు నమోదు చేసి, గాలింపు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు న్యాక్ బృందం

- సమావేశానికి హాజరు కావాలని విద్యార్థుల తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులకు పిలుపు

ధర్మవరం అర్బన్: స్థానిక కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఈ నెల 8, 9 తేదీల్లో న్యాక్ (నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్) బృందం సందర్శించనుంది. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కళాశాల అభివృద్ధి, సంస్థాగత విలువల్ని బృందం సభ్యులు పరిశీలించి, అవసరమైన పురోగతిని సూచించనున్నారన్నారు. డిగ్రీ కళాశాలలో విద్య పూర్తి చేసుకుని వివిధ రంగాలలో స్థిరపడిన వారు, ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఈ నెల 8న మధ్యాహ్నం కళాశాలకు రావాలని విజ్ఞప్తి చేశారు.

ఉద్యోగ భద్రత కల్పించండి

మడకశిర రూరల్: తమకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు ఎన్నికల సమయంలో ప్రస్తుత సీఎం చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీ మేరకు రూ.10 వేల వేతనం చెల్లించి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని గ్రామ వలంటీర్లు కోరారు. ఈ మేరకు శనివారం గౌడనహళ్లి గ్రామ సచివాలయం ఎదుట నిరసన వ్యక్తం చేసి, అడ్మిన్‌కు వినతి పత్రం అందించారు. అనంతరం వలంటీర్లు ప్రభావతి, సంధ్య, శ్రావణి, రవికుమార్, జగదీష్, ముద్ద రంగప్ప తదితరులు మాట్లాడారు. గత ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సేవలను పార్టీలకు అతీతంగా అర్హులందరికీ ఇంటి వద్దకే అందించామన్నారు. అధికారంలోకి రాకముందు ఒక మాట, వచ్చిన తర్వాత మరో మాట మాట్లాడడం సరికాదన్నారు. కూటమి సర్కార్ తీరుతో తమ బతుకులు రోడ్డు పాలయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. తమకు న్యాయం జరిగే వరకూ పోరాటాలు సాగిస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.



గౌడనహళ్లి సచివాలయంలో అడ్మిన్‌కు వినతి పత్రం ఇస్తున్న వలంటీర్లు

హంతకుడిని పట్టించిన మేకలు!

- జీపీ మాజీ ఉపాధ్యక్షుడి హత్య
- 24 గంటలు గడవకనే కటకటాలపాలైన నిందితుడు



హతుడు నరసింహప్ప (ఫైల్)

పావగడ: తమ యజమానిని హతమార్చిన దుండగుడిని 24 గంటలు గడవక ముందే మేకలు పట్టించాయి. వివరాలు... పావగడ తాలూకా కేటీ హళ్లి గ్రామ పంచాయతీ పరిధిలోని దేవలకెరె గ్రామానికి చెందిన నరసింహప్ప (55), రామక్క దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. గతంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొందిన నరసింహప్ప గ్రామ పంచాయతీ ఉపాధ్యక్షుడిగాను పనిచేసి అందరి మన్ననలు పొందారు. కొన్నేళ్ల క్రితం భార్య మృతి చెందింది. అప్పటి నుంచి ఇద్దరు కుమారులతో కలసి మేకల పోషణతో కుటుంబాన్ని పోషించుకునేవారు.

గొంతు కోసి.. హతమార్చి..

తన మేకలను నరసింహప్ప శుక్రవారం ఉదయం దేవలకెరె గ్రామ సమీపంలోని అటవీ ప్రాంత తిప్పప్పన కొండ ప్రాంతానికి తోలుకెళ్లాడు. మధ్యాహ్నం అటుగా వెళ్లిన వారు విగతజీవిగా పడి ఉన్న నరసింహప్పను గుర్తించి సమాచారం ఇవ్వడంతో కుమారులు మంజునాథ్, వీరభద్ర, పోలీసులు, పెద్ద సంఖ్యలో స్థానికులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. కొడవలితో నరసింహప్ప గొంతు కోసి హతమార్చినట్లుగా నిర్ధారణ అయింది. ఎడమ చేతి వేళ్లనూ కత్తిరించినట్లుగా గుర్తించారు. మేపునకు తోలుకెళ్లిన 30 మేకల జాడ లేకుండా పోయింది. దీంతో మేకలను అపహరించుకెళ్లడంలో భాగంగా నరసింహప్పను దారుణంగా హతమార్చినట్లుగా పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించి, కేసు నమోదు చేశారు.

బాధలోనూ ఆలోచించి..

తండ్రిని దారుణంగా హతమార్చిన బాధలోనూ పెద్దకుమారుడు మంజునాథ్ ఎంతో వివేకంతో ఆలోచించాడు. వెంటనే ద్విచక్ర వాహనాన్ని వేసుకుని శుక్రవారం రాత్రికి రాత్రే హరియూరుకు చేరుకున్నాడు. అక్కడ జరిగే మేకల సంతలో శనివారం ఉదయం విక్రయానికి పెట్టిన తన మేకలను గుర్తించాడు. కాసేపటి తర్వాత వాటిని అమ్ముతున్న వ్యక్తిని పట్టుకుని సమాచారం ఇవ్వడంతో అరసికెరె పోలీసులు అక్కడకు చేరుకుని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో కరియమ్మనపాళ్య గ్రామానికి చెందిన మణికంఠగా గుర్తించారు. నరసింహప్పను తానే హతమార్చి మేకలను అపహరించినట్లు పోలీసుల ఎదుట మణికంఠ అంగీకరించాడు. దీంతో నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని పూర్తి స్థాయిలో విచారిస్తున్నారు. కాగా, ఎంతో సౌమ్యుడిగా పేరొందిన నరసింహప్ప హత్యతో దేవలకెరె గ్రామం మూగబోయింది. సమాచారం అందుకున్న వాల్మీకి సంఘం నాయకులు దేవలకెరె గ్రామం చేరుకుని నరసింహప్ప మృతదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

వైఎస్ జగన్ అడుగుజాడల్లో నడుద్దాం

- ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి పిలుపు
- వైఎస్సార్ టీఏ నూతన సంవత్సర క్యాలెండర్ల ఆవిష్కరణ



క్యాలెండర్లు, డైరీలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి, వైఎస్సార్ టీఏ నాయకులు

పుట్టపర్తి: వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేశారని, భావితరాల బాగు కోసం అందరం ఆయన అడుగుజాడల్లో నడుద్దామని ఎమ్మెల్సీ, వైఎస్సార్ టీచర్స్ అసోషియేషన్‌రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు కల్పలతారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం ఆమె వైఎస్సార్ టీఏ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పీవీ రమణారెడ్డి, ఇంద్ర ప్రసాద్ కలిసి కొత్తచెరువు ఎమ్మార్సీ భవన ఆవరణలో వైఎస్సార్ టీఏ నూతన సంవత్సర క్యాలెండర్లు, డైరీలను ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, 10వ తరగతిలోనే బైలింగ్వల్ టెక్ట్స్ బుక్కులు తీసుకువచ్చిన ఘనత మాజీ సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. 1 నుంచి 5వ తరగతి వరకు విద్యార్థులకు బొమ్మలతో కూడిన నిఘంటువులు, పాఠశాలలో ఇంట్రాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్, స్మార్ట్ టీవీలు అందుబాటులోకి తెచ్చారన్నారు. ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టడంతో పాటు బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లను విద్యార్థులకు అందించారని గుర్తు చేశారు. ఇక 'నాడు-నేడు'తో దేశంలో ఎక్కడ లేని విధంగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దారన్నారు.

జిల్లాను అగ్రగామిగా నిలుపుదాం..

పదో తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించి జిల్లాను అగ్ర భాగాన నిలుపుదామని డీఈఓ కృష్ణప్ప పిలుపునిచ్చారు. శనివారం కొత్తచెరువు డీఈఓ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వైఎస్సార్ టీఏ నూతన క్యాలెండర్లు, డైరీలను ఆయన ఆవిష్కరించారు. అనంతరం అసోసియేషన్ నేతలు డీఈఓను ఘనంగా సన్మానించారు.

విలువలతో కూడిన విద్యనందించడమే లక్ష్యం



జ్యోతి ప్రజ్వలనతో బాలవికాస్ పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ప్రారంభిస్తున్న హిమవాహిని రత్నాకర్, కమలా పాండ్య

ప్రశాంతి నిలయం: బాల్యం నుంచే విలువలతో కూడిన విద్యను, ఆధ్యాత్మిక చింతనను పెంపొందించేలా విద్యను అందించడమే సత్యసాయి బాలవికాస్ విద్యా విధానమని సత్యసాయి సేవా సంస్థల జాతీయ విద్యా కో–ఆర్డినేటర్ కమలా పాండ్య అన్నారు. ప్రశాంతి నిలయం వేదికగా బాలవికాస్ విద్యార్థులు పూర్వ విద్యార్థుల సమ్మేళనం శనివారం అట్టహాసంగా ప్రారంభమైంది. సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్ రాజు సతీమణి హిమవాహినిరత్నాకర్, కమలా పాండ్య జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. 'జర్నీ ఫ్రం ఇండివిజువల్ పీస్ టూ గ్లోబల్ పీస్' పేరుతో నిర్వహించిన ఈ సమ్మేళనంలో కమలా పాండ్య మాట్లాడుతూ... బాలవికాస్ విద్యావిధానాన్ని వివరించారు. 1969లో సత్యసాయి ప్రారంభించిన బాలవిహార్‌లో 18వేల మంది గురువులు స్వచ్ఛందంగా పనిచేస్తున్నారన్నారు. 4 లక్షల మంది విద్యార్థులు బాలవికాస్ విద్యా విధానం ద్వారా శిక్షణ పొందుతున్నారన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలతో బాలవికాస్ చిన్నారులు ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా బాలవికాస్ పూర్వ విద్యార్థుల వెబ్‌పేజీను సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జె.రత్నాకర్ రాజు ప్రారంభించారు.

వ్యక్తి ఆత్మహత్య

గుడిబండ: మద్యం తాగేందుకు చేతిలో చిల్లిగవ్వ లేకపోవడంతో తీవ్ర అంతర్మథనానికి లోనైన ఓ వ్యక్తి చివరకు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... గుడిబండ మండలం కరికెర గ్రామానికి చెందిన హనుమంతరాయప్ప (47)కు భార్య శ్రీదేవి, ఓ కుమార్తె ఉన్నారు. కూలి పనులతో జీవనం సాగించేవారు. కొన్నేళ్ల క్రితం మద్యానికి బానిసైన హనుమంతరాయప్ప రోజూ మద్యం మత్తులో తూగుతూ ఏ పనీ చేయకుండా జులాయిగా మారాడు. ఈ క్రమంలో తరచూ మద్యం తాగేందుకు డబ్బు ఇవ్వాలంటూ భార్యను వేధించేవాడు. శుక్రవారం మద్యం తాగేందుకు తనకు డబ్బు కావాలని భార్యను హనుమంతరాయప్ప అడిగాడు. తన వద్ద డబ్బు లేదని ఆమె చెప్పడంతో సాయంత్రం వరకూ వేచి చూశాడు. అయినా మనసు ఆగలేదు. రాత్రి భోజనం ముగించుకున్న అనంతరం భార్య, కుమార్తె ఇంట్లో నిద్రిస్తుండగా బయటకు వచ్చిన హనుమంతరాయప్ప.. రేకుల షెడ్డుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య శ్రీదేవి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఆర్మీ మేజర్‌కు సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు



డాక్టర్ శంకర్ రాజ్‌కుమార్ (ఫైల్)

ధర్మవరం అర్బన్: భారత పదాతిదళం (ఆర్మీ)లో మేజర్‌గా విధులు నిర్వర్తిస్తూ మృతి చెందిన ధర్మవరానికి చెందిన శంకర్ రాజ్‌కుమార్ (34)కు సైనిక లాంఛనలతో శనివారం అంత్యక్రియలు నిర్వహించారు. వివరాలు.. మేజర్ శంకర్ రాజ్‌కుమార్ ఆర్మీలోని వైద్య విభాగంలో డాక్టర్‌గా లక్నోలో విధులు నిర్వర్తించేవారు. భార్య ప్రసన్న, కుమార్తె శన్విత(డాలి) హైదరాబాద్‌లోని మణికొండ వద్ద అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్నారు. ఈ నెల 2న లక్నో నుంచి హైదరాబాద్‌కు వచ్చిన ఆయన తాము నివాసముంటున్న అపార్ట్‌మెంట్ 5వ అంతస్తు నుంచి కిందకు దూకి ఆత్మహత్యకు యత్నించారు. గమనించిన స్థానికులు వెంటనే స్విమ్స్ ఆస్పత్రికి తరలించారు. చికిత్సకు స్పందించక ఆయన మృతిచెందారు. అన్నదమ్ములు శంకర్ శ్రీనివాసులు, శంకర్ సుధాకర్, ఈశ్వరయ్య, అశోక్‌కుమార్, పాలిశెట్టి సుధాకర్, తల్లి లక్ష్మీనరసమ్మ, కుటుంబసభ్యులు మేజర్ భౌతికకాయాన్ని శుక్రవారం ధర్మవరానికి తీసుకువచ్చారు. శనివారం ఉదయం ధర్మవరం శ్మశాన వాటికలో బెంగళూరు నుంచి వచ్చిన ఆర్మీ అధికారులు సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. భౌతికకాయంపై కప్పిన జాతీయ పతాకాన్ని మేజర్ తల్లి లక్ష్మీనరసమ్మకు అందించారు.కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ కామిరెడ్డిపల్లి సుధాకరరెడ్డి, బీజేపీ ఇన్‌చార్జ్ హరీష్‌బాబు తదితరులు శ్మశాన వాటికకు చేరుకుని మేజర్‌కు ఘన నివాళులర్పించారు.



జాతీయ జెండాతో గౌరవవందనం సమర్పిస్తున్న ఆర్మీ అధికారులు

జూదరుల అరెస్ట్

సోమందేపల్లి: మండలంలోని రూకలపల్లి సమీపంలో పేకాట ఆడుతున్న జూదరులను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు. అందిన సమాచారం మేరకు శనివారం ఉదయం రూకలపల్లి శివారు ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టామన్నారు. పోలీసుల రాకను గుర్తించిన పేకాటరాయుళ్లు అక్కడి నుంచి పారిపోతుండగా వెంటాడి తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నామన్నారు. మరో ఆరుగురు పరారయ్యారన్నారు. పట్టుబడిన జూదరుల నుంచి రూ.65 వేలు నగదు, రెండు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నరసాపూర్ ఎక్స్‌ప్రెస్‌కు త్రుటిలో తప్పిన ప్రమాదం

ధర్మవరం: నరసాపూర్‌– ధర్మవరం ఎక్స్‌ప్రెస్ రైలుకు శనివారం పెను ప్రమాదం తప్పింది. చలి తీవ్రత కారణంగా శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం మండలం తిప్పేపల్లి సమీపంలో ఎల్‌సీ నెంబరు– 8 వద్ద రైలు పట్టా పాక్షికంగా విరిగింది. విషయాన్ని గుర్తించిన కీమెన్ బండి ప్రసాద్ వెంటనే అప్రమత్తమయ్యాడు. అప్పటికే 120 కిలోమీటర్ల వేగంతో దూసుకొస్తున్న నరసాపూర్ ఎక్స్‌ప్రెస్ రైలును గమనించి ఎర్ర జెండా ఊపుతూ ఎదురుగా పరుగెత్తుకెళ్లాడు. అప్పటికే రైలు సమీపంలోకి రావడంతో చివరి క్షణంలో పట్టాల పక్కకు దూకి ప్రాణాలు దక్కించుకున్నాడు. అతి వేగం కారణంగా లోకో పైలెట్ రైలును ఆపే లోపు పాక్షికంగా దెబ్బతిన్న పట్టా ప్రాంతాన్ని దాటుకుని రెండు బోగీలు ముందుకెళ్లాయి. అనంతరం అదే రైలులో ప్రయాణిస్తున్న ఇంజినీరింగ్ అధికారుల సూచన మేరకు రైలును నెమ్మదిగా ముందుకు నడుపుతూ ధర్మవరం స్టేషన్‌కు చేర్చారు. అదే వేగంతో మరిన్ని బోగీలు వెళ్లి ఉంటే భారీ ప్రమాదం చోటు చేసుకునేదని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేశారు. రైలు వెళ్లిన అనంతరం అధికారులు రైలు పట్టా విరిగిన ప్రాంతానికి చేరుకుని మరమ్మతులు చేపట్టారు. పెను ప్రమాదం నుంచి చాకచక్యంగా తప్పించిన కీమెన్ బండి ప్రసాద్‌ను ప్రయాణికులతో పాటు రైల్వే అధికారులు అభినందించారు.